క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

బోట్‌క్లబ్: నగరంలోని పేర్రాజుపేటలో ఉన్న ఎస్‌వీ సాయిబాబా గురుస్వామి పీఠంలో బుధవారం అయ్యప్ప స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ఆవుపాలు, ఆవుపెరుగు, కొబ్బరినీరు, పాలు, పంచదార, విభూది, తేనె, కొబ్బరినీళ్లు, చెరుకు రసం, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్ర నామ పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. అయ్యప్పస్వామి శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది.

భక్తిశ్రద్ధలతో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి మహిళలు క్షీరాబ్ది ద్వాదశి పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. కార్తీక మాసంలో ద్వాదశి రోజు ప్రాముఖ్యాన్ని విష్ణ్వాలయం అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. మహిళలు ఇళ్ల వద్ద, విష్ణు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉసిరి, దీపం, వస్త్రం దానం చేసి వేద పండితులతో ఆశీర్వాదం తీసుకున్నారు. యండమూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ డిస్ట్రిబ్యూషన్ సెక్షన్-4 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. కృష్ణనగర్, బ్యాంక్ కాలనీ, దుర్గా విద్యుత్ నగర్, తోట సుబ్బారావునగర్, విద్య నగర్, లక్ష్మీ టెంట్ హౌస్ ఏరియా, గ్యాస్ కంపెనీ ఏరియా, స్టేడియం రోడ్డు వెనుక ప్రాంతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

కాకినాడ: వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 1 గంట వరకు అన్నమఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి ఒంటిగంట వరకు నరసింహారోడ్డు, శివాలయం వీధి, తారకరామనగర్, ఘాటీసెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందరనగర్, పప్పుల మిల్లు, మణికంఠనగర్, నాగరాజుపేట, పురం వారివీధి, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవినగర్, ముగ్గపేట, రెల్లిపేట, పద్మనాభనగర్, మేకానారాయణమ్మతోట, కాపులవీధి, మున్సిబ్ జంక్షన్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

- కలెక్టర్ షణ్మోహన్ సగిలి



క్యాన్సర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఇతర జిల్లా అధికారులు

కాకినాడ సిటీ: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి క్షేత్రస్థాయిలో చేపట్టే క్యాన్సర్ అవగాహన కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. ఇంటింటికీ తిరిగి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించి, అనుమానిత లక్షణాలు ఉంటే స్క్రీనింగ్ పరీక్షను ఇంటివద్దనే ప్రశ్నావళి ద్వారా సమాచారం సేకరిస్తారన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో దీనిపై అధికారులతో కలిసి కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్ఓ జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ, ఎన్‌సీడీ 3.0లో భాగంగా క్యాన్సర్ సర్వే, స్క్రీనింగ్ చేసేందుకు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యదర్శులకు జిల్లా స్థాయిలో మూడు రోజుల శిక్షణ నిర్వహించామన్నారు. ప్రతి రోజు వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు కాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తారన్నారు. క్యాన్సర్ వ్యాధికి గురికాకుండా తీసుకునే ముందస్తు జాగ్రత్తలు, వ్యాయామం, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, ధూమపానం, వ్యాధుల తీవ్రతపై కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని వైద్య సిబ్బందికి సూచించారు. రొమ్ము, నోటి, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను మహిళా ఆరోగ్య సిబ్బంది ఇంటివద్దనే చేస్తారని డీఎంహెచ్‌వో వివరించారు. క్యాన్సర్ నిర్ధారణ అయితే దగ్గరలో ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో, క్యాన్సర్ కేర్ హాస్పటల్ విశాఖపట్నంలోను ఉచిత వైద్యం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు ఆర్ ప్రభాకర్, ఆర్ రమేష్, సురేఖ, సుబ్బరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన, అధిక దిగుబడులకే పొలంబడి

- జేడీఏ విజయ్‌కుమార్


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప: వరిసాగులో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి, నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించేందుకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొరిపల్లిలో బుధవారం సాయంత్రం పొలంబడిలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందులు అవసరం మేరకే వినియోగించేలా, రైతులను నిష్ణాతులుగా తీర్చిదిద్దేందు ప్రతి సీజన్‌లో వారానికి ఒకరోజు వంతున 14 వారాలు పొలంబడి నిర్వహిస్తున్నట్టు వివరించారు. రైతులు పొలంబడిలో నేర్చుకున్న పద్ధతులను ఇతర రైతులకు కూడా తెలియజెప్పాలన్నారు. 1993 నుంచి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది నుంచి గాప్ పొలంబడి(గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) పేరుతో రైతులకు ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు. తద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించడమే కాకుండా,, ఆ ధాన్యాన్ని రైతు ఉత్పాదక సంఘాల ద్వారా మద్దతు ధరకు మించి ఎక్కువకు కొంటారని వివరించారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఏఈఓలు నోవా, ప్రశాంత్ శ్రీరాములు, తేజ, రైతులు పి.నాగేశ్వరరావు, ఆర్‌వీవీ సత్యనారాయణ, కృష్ణ, రాంబాబు, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబుకు రాగిరెడ్డి అభినందనలు


కన్నబాబుకు అభినందనలు తెలుపుతున్న రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు

కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును కౌడ మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అభినందించారు. సమర్ధవంతమైన కన్నబాబు నాయకత్వాన్ని గుర్తించి, మరోసారి అధ్యక్ష పదవిని ఇచ్చిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమెతో పాటు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, రాగిరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.

జాతీయ క్రీడలకు రమణయ్యపేట స్కూల్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబర్‌లో గుజరాత్‌లో జరిగే అండర్-17 జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ స్విమ్మింగ్ పోటీలకు స్థానిక రమణయ్యపేట కార్పొరేషన్ పాఠశాల విద్యార్థి కె.ముత్యాల ముఖేష్ ఎంపికయ్యాడు. నవంబర్ 5 నుంచి మూడు రోజుల పాటు పల్నాడు జిల్లా నరసరావు పేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో ముఖేష్ ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల హెచ్‌ఎం సీబీవీ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. అదేవిధంగా నవంబర్ 7 నుంచి 9 వరకు కాకినాడ డీఎస్ఏలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ జిమ్నాస్టిక్స్ పోటీలలో అండర్-17 విభాగంలో జె.అభిరామ్, సీహెచ్ ప్రేమ్‌కుమార్ డిసెంబర్‌లో కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీ రమణ, భాస్కర్‌రావు, పీఈటీ ఎస్‌కే అలీమ్ పాషా తదితరులు అభినందించారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి


గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కరప: రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా దరఖాస్తు చేసుకుంటే, రీ సర్వే ద్వారా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దాపురప్పాడులో బుధవారం జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూ విస్తీర్ణంలో హెచ్చు,తగ్గులు, పేర్ల తప్పులు, కొత్త పట్టాదార్ పాసు పుస్తకాలు, సర్వే నంబర్లు, సబ్ డివిజన్ వంటి సమస్యల పరిష్కారం కోరుతూ 42 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, ఆర్ఐ పవన్, వీఆర్వో డి.భరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు వరం ఓఎన్‌డీసీ


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ సుధాకర్

- ఏడీసీ సుధాకర్

కాకినాడ: కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఏర్పాటైన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ)లో ప్రతి వర్తకుడు చేరి డిజిటల్ వ్యాపార లావాదేవీలను సులభంగా నిర్వహించుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. ఓఎన్‌డీసీపై మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో బుధవారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో గూగుల్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను కూడా ఈ డిజిటల్ కామర్స్ ఆన్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా మార్కెట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, అమెజాన్, ఎస్‌బీఐ, మేటా సంస్థలతో అనుసంధానమైన హెల్త్‌కేర్ ప్రొడక్ట్ నుంచి ఫిన్‌టెక్, అగ్రి బిజినెస్ కార్యకలాపాలను ఓఎన్‌డీసీ ద్వారా నిర్వహిస్తున్నారన్నారు. దీనిని వివిధ నగరపాలక సంస్థలలో అభివృద్ధి చేసి, చిన్న, మధ్య తరగతి ఉత్పత్తి, అమ్మకందారులు, కొనుగోలుదారులకు ఆదాయం పెంచాలన్నదే లక్ష్యమన్నారు. నగరంలో ప్రతి వర్తకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ప్రియంవద, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీపీఆర్వో శైలజ, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు పాల్గొన్నారు.

కుంభాభిషేకం వద్ద రోడ్డు నిర్మించాలి


ఆదికుంభేశ్వర ఆలయం ముందు అధ్వానంగా ఉన్న రోడ్డు

కాకినాడ రూరల్: సాగర తీరాన ఆదికుంభేశ్వర స్వామి కొలువైన కుంభాభిషేకం వద్ద రోడ్డును నిర్మించాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. డిసెంబర్ ఒకటిన జరగనున్న మహా కుంభాభిషేకం ముందు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు, ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చర్యలు తీసుకోవాలని బుధవారం ఆయన కోరారు. దుమ్ములపేట రైల్వే గేటు నుంచి కుంభాభిషేకం వరకు రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైందన్నారు. కార్పొరేషన్ నిధులతో పాటు, పరిశ్రమలు, పోర్టు తోడ్పాటుతో సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి


కొంగోడులో పోటీల విజేతలకు బహుమతులు ఇస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

కరప: విద్యతోనే కుటుంబ వికాసం, తద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. ప్రతి ఒక్కరూ పాఠశాల స్థాయి నుంచి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొంగోడులోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే చదువుకుని ఎంపీడీఓగా ఉద్యోగం చేస్తున్నానన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు చదువు ఎందుకని వివక్ష చూపకుండా, ప్రతి ఒక్కరినీ చదివించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి కలెక్టర్, డాక్టర్, ఇంజినీర్ కావాలన్న లక్ష్యంతో విద్యార్థులు చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 65 పాఠశాలలకు చెందిన 1,2,3 తరగతుల విద్యార్థులకు అభినయ గేయాలు, పద్యాలు, తెలుగు, ఇంగ్లిష్ పదాలు చదవడం, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అలాగే 4, 5 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, సైన్స్ క్విజ్, గేమ్స్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణతో కలిసి ఎంపీడీఓ అనుపమ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీటు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లయన్స్ క్లబ్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఎంవీఆర్ మోహన్‌కుమార్ అన్నారు. క్లబ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో బుధవారం టెస్ట్ ఆఫ్ రీజనింగ్ అండ్ లాజికల్ థింకింక్ అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్ మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు ఈ అంశాలు చాలా దోహదపడతాయన్నారు. వారం రోజుల పాటు విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రాజెక్టు చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, ఎస్.మురళీకృష్ణ, జీఎల్ జగన్నాథరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ కార్యాలయంలో నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం. వరలక్ష్మి ఆర్థిక సహకారంతో బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శీతాకాలంలో చలి తీవ్రత బారి నుండి వృద్ధులను కాపాడడానికి ఏటా గ్రామంలో పలు ప్రాంతాలలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పరోపకారం ఎంతో ఉత్తమమైందని చెప్పారు. ఉన్నదానిలో కొంత పేదల అభ్యున్నతికి ఉపయోగించాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సమాజ సేవలోనే సంతృప్తి ఉందన్నారు. అ దిశగా ఏటా వేసవిలో పాదరక్షలు, వర్షాకాలంలో గొడుగులు, శీతాకాలంలో దుప్పట్ల పంపిణీ ఇలా పలు సేవలను అందిస్తున్న వరలక్ష్మి సేవా తత్పరత అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా, ఒకరికి నాలుగు రోజుల జైలు, ఇద్దరికి మూడు రోజుల జైలు, ఐదుగురికి రెండు రోజుల చొప్పున జైలు, మరో ఐదుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

విద్యార్థులకు ఉచితంగా క్రీడా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న తలాటం హరీష్

బోట్ క్లబ్: క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ తెలిపారు. స్థానిక శ్రీనగర్‌లోని మున్సిపల్ స్కూల్లో విద్యార్థులకు రూ.16 వేల విలువైన క్రీడా పరికరాలను బుధవారం అందించారు. పాఠశాల విద్యార్థులు తమకు క్రీడా పరికరాలు కావాలని కోరడంతో, వారి కోరిక మేరకు ఈ క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి కాకినాడకు మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ

- తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి
- విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి

కాకినాడ సిటీ: తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులపై పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి పాఠశాలను సందర్శించారు. ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. ఆంగ్ల ఉపాధ్యాయుడైన మహమ్మద్ తానీషా వలిబాబా తరగతి గదిలో అసభ్యకరమైన, అశ్లీల వీడియోలు చూడటం, ఆ వీడియోలను పిల్లల వైపు తిప్పేవారని, బాలికలను అసభ్యకరంగా తాకేవారని, తరగతి తలుపులు మూసివేసి విద్యాబోధన చేసేవారని విద్యార్థినులు కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మికి వివరించారు. లైంగిక వేధింపులకు గురి చేసినా, ప్రేమ పేరుతో వేధించినా, దుర్భాషలతో మాట్లాడినా పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయదుర్గ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలల హక్కులు, పరిరక్షణ, బాలలపై జరుగుతున్న వేధింపులు అరికట్టడం, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 1098 ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, ఏసుదాసు, జె.విజయ, స్వర్ణసుధ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

బాలాజీచెరువు: గాంధీనగర్ గ్రంథాలయంలో గురువారం నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు తెలిపారు. తొలి రోజున నెహ్రూ జయంతి నిర్వహిస్తామని, ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయాధికారి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ హాజరవుతారన్నారు. 15న పుస్తక ప్రదర్శన, డ్రగ్స్‌పై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖనం, 19న మహిళా దినోత్సవం, దిశ చట్టం, మహిళ సాధికారతపై చర్చ, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు ఉంటాయని వివరించారు.